


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఆదిలాబాద్

మంచిర్యాల
నిర్మల్ - కొమరం భీం
ఆసిఫాబాద్

శుక్రవారం 14 నవంబర్ 2025 పేజీలు 06




విద్యారంగ బలోపేతం దిశగా

## ప్రభుత్వం కృషి

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**





**మంచిర్యాల ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :**

ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి తరగతి గదులు, వంటశాల, మధ్యాహ్న భోజనం నాణ్యత, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, ప్రహరీ గోడ ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తుందని తెలిపారు. ఈ క్రమంలో విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించి గుణాత్మక విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, ఈ నేపథ్యంలో విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యను అభ్యసించాలని తెలిపారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయడంతో పాటు తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పాఠశాలలో చేపట్టిన అదనపు గదుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వార్డులు, మందుల నిల్వలు, ల్యాబ్, పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. వైద్యులు సిబ్బంది విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్య సేవలు అందించాలని తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని ఎం పి డి ఓ మధుసూదన్ తో కలిసి సందర్శించి రికార్డులు, రిజిస్టర్లు పరిశీలించి మండలంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతి వివరాలను తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, నిరుపేదల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్ధిదారులు నిర్దేశిత విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకునే విధంగా అధికారులు అవగాహన కల్పించాలని తెలిపారు. నిబంధనల ప్రకారం ఇల్లు నిర్మించుకున్నట్లయితే సకాలంలో నిర్మాణ దశల వారీగా బిల్లులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. మండలంలో త్రాగునీరు, పారిశుద్ధ్యం, అభివృద్ధి పనుల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి ఉజ్వల పథకం క్రింద లబ్ధిదారుల

## ఎంపికపై అవగాహన చేపట్టాలి

**- జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**



**ఆసిఫాబాద్ ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :**

ప్రధానమంత్రి ఉజ్వల పథకం కింద ఎల్ పి జి గ్యాస్ లబ్ధిదారుల ఎంపికపై విస్తృత అవగాహన చేపట్టాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భావన సమావేశం మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాలతో కలిసి ప్రధానమంత్రి ఉజ్వల పథకంపై పౌరసరఫరాల శాఖ అధికారులు, తహసిల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, రవాణా, వ్యవసాయ, మత్స్య శాఖల అధికారులు, హిందుస్థాన్ పెట్రోలియం, భారత్ పెట్రోలియం ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఉజ్వల పథకం కింద పేదవారికి ఉచితంగా ఎల్.పి.జి.గ్యాస్ సిలిండర్లు అందిస్తుందని, అర్హులైన వారిని గుర్తించడంలో సంబంధిత శాఖల అధికారులు విస్తృతంగా అవగాహన పరచాలని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళ సభ్యుల ద్వారా గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించాలని, ఉజ్వల సిలిండర్ అనర్హుల చేతిలో ఉంటే సమగ్ర విచారణ జరిపి తొలగించాలని, ఆదాయం, భూ విస్తీర్ణం, వాహనాలు కలిగిన యజమానుల వివరాలు సేకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వసంతలక్ష్మి, రవాణా శాఖ అధికారి రామ్ చందర్, వ్యవసాయ శాఖ అధికారి వెంకటి, మత్స్యశాఖ అధికారి సాంబశివరావు,తహసిల్దార్లు, హిందుస్థాన్ పెట్రోలియం, భారత్ పెట్రోలియం ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోటీలలో గెలవడం కంటే

## పాల్గొనడమే ముఖ్యం

**- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్**

**నిర్మల్, సూర్య మేజర్ న్యూస్ :**

మాట్లాడుతూ, క్రీడలు, సాంస్కృతిక పోటీలలో గెలవడం కంటే పాల్గొనడమే ముఖ్యమైందని తెలిపారు.ఇలాంటి ఉత్సవాలు విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించడంలో, ఆత్మవిశ్వాసం పెంచడంలో దోహదపడతాయని అన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా జాతీయ యువజన దినోత్సవాన్ని జరుపుకుంటామని, అదే స్ఫూర్తితో ఈ యువజన ఉత్సవాలను నిర్వహిస్తున్నామని వివరించారు. వివేకానంద భారత యువతకు ప్రేరణ. ఆయన చూపిన మార్గంలో నడిస్తే దేశం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు.అనంతరం కలెక్టర్ వైజ్ఞానిక ప్రదర్శనలను ప్రారంభించి, విద్యార్థులు రూపొందించిన నమూనాలను పరిశీలించారు. విద్యార్థులు తమ ఆవిష్కరణలను కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు వివరించారు.ఈ కార్యక్రమంలో డీఈఓ భోజన్న, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, డిపిఆర్ఓ విష్ణువర్ధన్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్,పలు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల సృజనాత్మకత వెలికితీయడమే

## యువజన ఉత్సవాల లక్ష్యం

**- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**




**నిర్మల్ ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :**

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ, నైపుణ్యాలను వెలికితీయడానికి యువజన ఉత్సవాలు దోహదపడతాయని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు.గురువారం పట్టణంలోని ఎన్‌టిఆర్ మినీ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజన ఉత్సవాల ప్రారంభోత్సవంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ కు ఎన్‌సిసి విద్యార్థులు బ్యాండ్ మేళాలతో ఘనంగా స్వాగతం ప లి కా రు. అనంతరం ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి, స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి మనిషి జీవితంలో యవ్వన దశ ఎంతో కీలకమైనదని, ఈ దశలో ఎటువంటి చెడు వ్యసనాలకు లోనుకాకుండా, జీవితంలో స్పష్టమైన లక్ష్యం పెట్టుకుని దానిని సాధించడానికి కృషి చేయాలన్నారు. స్వామి వివేకానంద వంటి మహనీయుల ఆలోచనలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.యువజన ఉత్సవాల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, నాయకత్వ గుణాలు, బృందాత్మకత పెంపొందుతాయని తెలిపారు. గత ఏడాది రాష్ట్రస్థాయిలో నిర్మల్ జిల్లాకు రెండో స్థానం రావడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈసారి మరింత ప్రతిభ కనబరచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో జిల్లాకు పేరు తెచ్చేలా విద్యార్థులు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లా స్థాయి యువజన ఉత్సవాలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రతి విద్యార్థి పాల్గొనే అవకాశాన్ని కల్పించాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ఇలాంటి సృజనాత్మక కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారు.



సూర్య
www.suryaa.com
శుక్రవారం 14 నవంబర్ 2025

## పట్టుబడ్డ గంజాయి విక్రయదారులు

**ఖానాపూర్ టౌన్ నవంబర్ 13 సూర్య మేజర్ న్యూస్**

ఖానాపూర్ పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పత్రిక విలేకరుల




సమావేశంలో సిఐ అజయ్ కుమార్ మాట్లాడుతూ గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు అని అన్నారు. పట్టుబడిన వారి నుండి 3 లక్షల విలువ గల గంజాయిని స్వాధీనం చేసుకొని, వారిని రిమాండ్ కు పంపినట్లు తెలిపినారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాహుల్ గైక్వాడ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

**నస్పూర్, నవంబర్ 13, సూర్య మేజర్ న్యూస్:**

ఆదివాసి బచావో లంబాడా హఠావో అనే ప్రధాన నినాదంతో గత 30 సంవత్సరాల నుండి పోరాటం చేస్తున్న ఆదివాసి నాయకులు, లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని అన్నారు. ఆదివాసి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కుడిమేత తిరుపతి, రాష్ట్ర కార్యదర్శి సోయం జంగు




అధ్యక్షతన గురువారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆదివాసి నాయకుల వలన వచ్చిన లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనే ఏకైక డిమాండ్ తో, ఈ నెల నవంబర్ 23న ఉట్నూరు కేంద్రంగా ఎంపీడీవో గ్రామంలో ధర్మ యుద్ధం పేరిట ఆదివాసీల బహిరంగ సభ జరుగుతుందని అన్నారు. ఈ సభకు ఉమ్మడి అదిలాబాద్ జిల్లా నుండి, ఆదివాసులు పెద్ద మొత్తంలో తరలి రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి నాయకులు కనకరాజు, అలం బాపు, పెద్ద భార్గవ్, మల్కచిలకయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్కే 7 గనిలో బొగ్గు నాణ్యత వారోత్సవాలు

**శ్రీరాంపూర్, నవంబర్ 13, సూర్య మేజర్ న్యూస్:**

శ్రీరాంపూర్ ఏరియా లోని ఆర్కే-7 గని లో గురువారం బొగ్గు నాణ్యత అవగాహన వారోత్సవాల్లో భాగంగా గని మేనేజర్ జె. తిరుపతి నాణ్యత జెండా ఆవిష్కరించి వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గని మేనేజర్ జె. తిరుపతి మాట్లాడుతూ విద్యుత్, ఇతర పరిశ్రమల పురోగతి కోసం సరఫరా



చేసే బొగ్గు నాణ్యతపైనే ఆధారపడి ఉంటుందన్నారు. నాణ్యమైన బొగ్గును సరఫరా చేసి వినియోగదారుల నమ్మకాన్ని కాపాడుకోవాలన్నారు ఎస్డిఎల్ యంత్రాలతో లోడింగ్ చేసే సమయంలో మట్టిని షెల్ నీ తొలగించి బొగ్గును మాత్రమే గని ఉపరితలానికి పంపేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. నాణ్యత విషయంలో షెల్ పికింగ్ కార్మికుల సహకారానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రక్షణాధికారి సంతోష్ రావు, ఫిట్ సెక్రటరీ మారేపల్లి సారయ్య, వెంటిలేషన్ ఆఫీసర్ జగదీష్ రావు, పిట్ ఇంజనీర్ ప్రవీణ్, అండర్ మేనేజర్లు రాము, రవీందర్, రవితేజ సంక్షేమ అధికారి సంతన్ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**నేరడి గొండ. నవంబర్ 13 సూర్య మేజర్ న్యూస్**

మండలంలోని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నివాసంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. మండలంలోని వాడుర్ గ్రామానికి చెందిన సయ్యద్ జహెర బేగం కు రూ, 20500, అలాగే సోలార్ మండలంలోని గుట్ట పక్క తండా గ్రామానికి చెందిన సరక్వార్ సరితకు,రూ, 60000 వేల రూపాయల చెక్కులను వారికి ఎమ్మెల్యే అందజేశారు. ఈ పంపిణీ కార్యక్రమంలో మండల నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు ఉన్నారు.

# విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

### - డి సి పి భాస్కర్....

**మంచిర్యాల, నవంబర్ 13, సూర్య మేజర్ న్యూస్:**

విద్యార్థి దశ నుండి సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని డిసిపి భాస్కర్ అన్నారు. గురువారం స్థానిక కార్మల్ కాన్వెంట్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ సారూప్య ఆధ్వర్యంలో పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై




అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ మొబైల్ వాడుతున్న విద్యార్థులు ఎక్కువగా వాడరాదని తెలిపారు. తెలియని యాప్, మెసెజ్‌ల లింక్‌లపై టచ్ చేయరాదని సూచించారు. ఇటీ వల సైబర్‌నేరాలు అధికమయ్యాయని, వాటిని అరికట్టేందుకు ప్రజలు సహకరించాలన్నారు.తెలియని వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం ఓటీపీలు చెప్పరాదన్నారు. మొబైల్ ద్వారానే 80 శాతం సైబర్ నేరాలు జరుగుతున్నాయన్నారు. పెరుగుతున్న సాంకేతికతను ఆసరాగా చేసుకుని సైబర్ నేరాలకు కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారని విద్యార్థులు అవగాహన పెంచుకుని ఇటువంటి మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చుట్టూ ఉన్న సమాజాన్ని కూడా జాగృతం చేయాలన్నారు. బాలికలపై అత్యాచారాలకు పాల్పడటం, బాల్య వివాహాలు చేయడం, వారిని ప్రోత్సహించడం వంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. 18 సంవత్సరాలు పై బడినవారు మాత్రమే వాహనాలను నడపాలని ట్రాఫిక్ ఎస్సై సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో షిటిం ఎస్సై ఉషారాణి, హైమ, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ సీమ, సిస్టర్ అర్పితబోధనా సిబ్బంది పాల్గొన్నారు.



# విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేసిన బేర వేణు

**మందమర్రి, నవంబర్ 13, సూర్య మేజర్ న్యూస్**

ఉమ్మడి అదిలాబాద్ జిల్లా నుండి రాష్ట్రస్థాయి



అండర్ 17 ఫుట్బాల్ టోర్నమెంట్ కు బయలుదేరిన ప్రభుత్వ పాఠశాలల క్రీడాకారులకు మందమర్రి పట్టణానికి చెందిన ఆర్.టి.ఎ ఏజెంట్, కాంగ్రెస్ నాయకులు బేర వేణుగోపాలరావు క్రీడా దుస్తులు (స్పోర్ట్స్ డ్రెస్) అందజేశారు. ఈనెల 14 నుండి 16 తారీఖు వరకు నల్గొండ జిల్లాలో జరగబోవు రాష్ట్ర స్థాయి అండర్ 17 ఫుట్బాల్ టోర్నమెంట్ కు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుండి తరలిన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తమవంతుగా ఏమైనా చెయ్యాలనే తపనతో బీర నిర్మిత, బేర మేనిత లు తన తండ్రి స్థానిక ఆర్.టి.ఎ ఏజెంట్ బేర వేణుకు వ్యక్తం చేయగా, తమ పిల్లల కోరిక మేరకు ఐదు వేల రూపాయలు విలువగల క్రీడ దుస్తులు (జెర్సీలు) అందజేసి క్రీడాకారులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా బేర వేణు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చేరుటకు ప్రోత్సాహకంగా ఉంటుందనే ఆలోచనతో క్రీడా దుస్తులను విద్యార్థులకు అందజేయడం మా పిల్లలకు, తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని అన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, శారీరక దృఢత్వాన్ని కలిగిస్తాయని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని అన్నారు. విద్యార్థులు తమ నైపుణ్యతను కనబరచి క్రీడల్లో రాణించాలని, రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించి జిల్లా నుండి కప్ కైవసం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ బాయ్స్ హై స్కూల్ ప్రిన్సిపాల్, పీడీలు రాజయ్య, రమేష్, కోచ్ గాలి పెల్లి సురేందర్ లు పాల్గొన్నారు.

### పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో

## కార్తీక మాసం మన భోజనాలు

**రామకృష్ణాపూర్, నవంబర్ 13, సూర్య మేజర్ న్యూస్**

పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక మాసం వనభోజనం ఈ నెల 14న శుక్రవారం స్థానిక గాంధారి మైసమ్మ వనం లో ఘనంగా నిర్వహించడం జరుగుతుందని సంఘం అధ్యక్షులు వనం సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఆడేపు తిరుపతి తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి నాయకులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. సంఘానికి చెందిన అన్ని కుల బంధువులు తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లలో స్టీరింగ్ కమిటీ సభ్యులు ఆడేపు లక్ష్మణ్ (సహాయ కార్యదర్శి), వేముల అశోక్, కొండా కుమార్ (ఆర్గనైజింగ్ కార్యదర్శి), గాజంగి సంతోష్, సారయ్య తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదాలను అరికట్టడమే పోలీసుల ప్రథమ కర్తవ్యం -జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**గుడిహత్నూర్ నవంబర్ 13 మేజర్ సూర్య న్యూస్:**

జిల్లాలో రోడ్డు ప్రమాదాలను పూర్తిగా అరికట్టడమే పోలీసులు ప్రథమ కర్తవ్యం అని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. గురువారం మండలంలోని జాతీయ రహదారి 44 పై గత రెండు సంవత్సరాలలో అత్యధిక ప్రమాదాలు జరిగిన ప్రదేశాలను రెవిన్యూ, పంచాయతీరాజ్, నేషనల్ హైవే అథారిటీ, కాంట్రాక్టర్స్ తో పాటు పోలీసు అధికారులతో ప్రమాదాల స్థలాలను పరిశీలించిగుర్తించి ప్రమాదాలు జరిగిన కారణాలు వాటి నివారణకు చేపట్టవలసిన జాగ్రత్తలపై సిబ్బందికి అధికారులకు సూచించారు. ముఖ్యంగా గుడిహత్నూర్ మండలంలోని వాఘపూర్ ఎక్స్ రోడ్,మేకలగండి, సితాగోంది గ్రామం, గుడిహత్నూర్ బస్టాండ్ ప్రదేశాలలో ఎక్కువ ప్రమాదాలు జరిగిన ప్రదేశాలను సందర్శించారు. గత కొన్ని సంవత్సరాలుగా జరిగిన ప్రమాదాల విశ్లేషణ చేసి ఇక ముందు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు.ప్రమాదాలు జరగకుండా నేషనల్ హైవే పై వేగ నియంత్రణ నివారించేందుకు రంబుల్ స్ట్రిప్స్,అప్రోచ్ రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు వెయలని నిర్మాణ ప్రదేశాలలో తగు సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని మరమ్మతు జరుగుతున్న ప్రదేశాలలో మనుషులను ఉంచి 24 గంటలు పర్యవేక్షించాలని , రాత్రి సమయాలలో కనిపించే విధంగా రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేయాలన్నారు. వేగంగా వెళ్లే దారులలో వేగ నియంత్రణకు ప్రమాదాలు జరిగే ప్రదేశాలలో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.హైవే పై స్పీడ్ లేజర్ గన్ లను ఏర్పాటు చేసి వేగ నియంత్రణ తెలపాలన్నారు.జాతీయ రహదారి పక్కన ఉన్న పట్టణాలలో గ్రామాలలో లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాదాలను నివారించి ప్రాణనష్టాన్ని తగ్గించడమే జిల్లా పోలీసుల ప్రధాన ధ్యేయం అన్నారు. ప్రజల రక్షణ కొరకు జిల్లా పోలీసులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో ఉట్నూర్ అదనపు ఎస్పీ కాజల్ సింగ్, ఇచ్చోడా సిఐ.బండారి రాజు, ఎస్సై శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఏకాగ్రతతో చదివి సమాజానికి మెరుగైన వైద్య సేవలు అందించాలి

## - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల బ్యూరో,సూర్య మేజర్ న్యూస్ :**

వైద్య కళాశాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు ఏకాగ్రతతో చదివి సమాజానికి విలువలతో కూడిన మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేటలో గల ప్రభుత్వ వైద్య కళాశాలలో 2025 సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ సులేమాన్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య విద్యార్థులు ఏకాగ్రతతో చదివి సమాజానికి మంచి వైద్య నైపుణ్యం, విలువలతో కూడిన మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులకు పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పించడం జరుగుతుందని, వసతి గృహంలో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. డిసెంబర్ 31 నాటికి గుడిపేటలో నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వం రాష్ట్రాన్ని మెడికల్ హబ్ గా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో జిల్లా కేంద్రంలో 300 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, జిల్లాలోని లక్షెట్టిపేట, చెన్నూర్, బెల్లంపల్లి ప్రాంతాలలో సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటుచేసి ప్రతిరోజు దాదాపు 500 మంది ప్రజలకు వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. మంచిర్యాల జిల్లాలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆసుపత్రులు, వైద్య కళాశాల ద్వారా సమీప జిల్లాల నుండే కాకుండా పక్క రాష్ట్రాల నుంచి ప్రజలు వైద్య సేవలు పొందుతున్నారని తెలిపారు. వైద్య విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల నుండి ప్రజలు మెరుగైన వైద్య సేవలు ఆశిస్తారని, తదనుగుణంగా విద్యార్థులు విద్యలో నైపుణ్యం పొందాలని తెలిపారు. ప్రభుత్వ వైద్య రంగాన్ని అభివృద్ధి చేసి ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, నర్సులు, సిబ్బందిని నియమించడం జరుగుతుందని, పీడియాట్రీషియన్, అనస్తీసియా, ఇతర వైద్య నిపుణులను తయారు చేసి ప్రజలకు సేవలు అందించడం కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రులు తప్పనిసరిగా మెడికల్ కౌన్సిల్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, నిరుపేదలకు వైద్యాన్ని ఉచితంగా అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. 2047 రైసింగ్ తెలంగాణ కార్యక్రమంలో భాగంగా దేశానికి స్వాతంత్రం వచ్చి 100 సంవత్సరాలు 2047 నాటికి పూర్తవుతున్న సందర్భంలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు అందరం సమిష్టిగా కృషి చేద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.






## విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందించాలి

### - జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), ఇన్చార్జి జిల్లా విద్యాధికారి దీపక్ తివారి

**ఆసిఫాబాద్ ప్రతినిధి,నవంబర్ 13, సూర్య మేజర్ న్యూస్ :**

ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), ఇన్చార్జి జిల్లా విద్యాధికారి దీపక్ తివారి అన్నారు. గురువారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం అంకుశాపూర్ గ్రామపంచాయతీ తేలిగూడ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజనం మెనూ, తరగతి గదులు, రిజిస్టర్లు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పాఠశాలలో మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, ఆహారం తయారీ సమయంలో పరిశుభ్రత నిబంధనలు పాటించాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎ.ఐ. పద్ధతిలో విద్యార్థులకు బోధించడం ద్వారా పఠన సామర్థ్యం పెంపొందుతుందని తెలిపారు. అనంతరం గ్రామపంచాయతీ పరిధిలోని ఇందిరమ్మ ఇండ్ల పనుల పురోగతిని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, నిబంధనల ప్రకారం నిర్ణీత విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి టి.శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి కవిత, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల దరఖాస్తు తేదీని పొడగించాలి

### - కుటుంబ సభ్యుల పాత కుల పత్రాన్ని ప్రామాణికంగా చేసుకొని కులం సర్టిఫికేట్ మంజూరు చేయాలి

**బెల్లంపల్లి, నవంబర్ 13, సూర్య మేజర్ న్యూస్:**

భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ (ఐక్య)(ఎంసిపిఐ(యు)పార్టీ) ఆధ్వర్యంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల దరఖాస్తు తేదీని పొడిగించాలని, కుటుంబ సభ్యుల పాత కుల పత్రాన్ని ప్రామాణికంగా చేసుకొని కులం సర్టిఫికేట్ మంజూరు చేయాలని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎ.ఒ, మండల తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ కృష్ణ లకు వినతి పత్రం అందజేయడం జరిగింది. ఎంసిపిఐయు పార్టీ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు దరఖాస్తు ప్రక్రియ మొదలు పెట్టడం వల్ల కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు దరఖాస్తుకు జత చేయాలనే నిబంధన ఉండటంవల్ల చాలామంది నిరుపేదలు, చదువు లేని వారు తాసిల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని, వీరికి గతంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు లేకపోవడం వల్ల వారి కుటుంబ సభ్యులైన కూతురు, కుమారుడి తాసిల్దార్ జారీ చేసిన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ లను దరఖాస్తుతో పొందుపరిచినప్పటికీ లాయర్ అఫిడవిటి, గెజిటెడ్ సంతకాలు కావాలంటూ లేకుంటే సర్టిఫికెట్స్ రిజెక్ట్ అవుతాయంటూ చెప్పడం వల్ల చాలామంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇదే అదునుగా చేసుకొని దళారులు ప్రజల వద్ద నుండి డబ్బులు తీసుకుంటున్నారని, ఇక్కడ నూటికి 90 శాతం మంది ప్రజలు రెక్కాడితేనే డొక్కాడే కూలి, నాలి చేసుకొని బ్రతికే నిరుపేదలని 200 నుండి 500 రూపాయలు లాయర్ అఫిడవిటి తీసుకుంటున్నారని, డబ్బులు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారని, కాబట్టి ప్రజలపై ఆర్థిక భారం పడకుండా కుటుంబ సభ్యుల పాత కులం సర్టిఫికెట్ ప్రామాణికంగా చేసుకొని కులం సర్టిఫికెట్స్ మంజూరు చేయాలని అన్నారు. వెంటనే బెల్లంపల్లి తాసిల్దార్ స్పందించి కుటుంబ సభ్యుల పాత కులం సర్టిఫికెట్స్ దరఖాస్తుతో జత పరిస్తే సరిపోతుందని, ఎటువంటి లాయర్ అఫిడవిటి పెట్టనవసరం లేదని, అఫీటవిటి పెట్టాలని ఎవరు ప్రజలను ఇబ్బంది పెట్టకూడదని కార్యాలయ సిబ్బందికి చెప్పడం జరిగింది. ఎంసిపిఐ(యు) పార్టీ విజ్ఞప్తికి స్పందించి ప్రజలపై ఆర్థిక భారం పడకుండా చర్యలు తీసుకున్న బెల్లంపల్లి తాసిల్దార్ కు బెల్లంపల్లి ప్రజల తరఫున, మా పార్టీ తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంసిపిఐ (యు)పార్టీ పట్టణ కార్యదర్శి ఆరేపల్లి రమేష్, నాయకులు పోలోజు రామకృష్ణ, శ్రీనివాస్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.







## ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

**ముధోల్,13నవంబర్,సూర్య మేజర్ న్యూస్**

బైంసా పట్టణంలోని అపెక్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మండల కేంద్రంలోని నూర్ పాలీ క్లినిక్ లో చేపట్టిన ఉచిత వైద్య శిబిరంలో స్త్రీ వైద్య నిపుణులు సనోబర్ రహమాన్, చిన్నపిల్లల వైద్య నిపుణులు జీషాన్ లు రోగులకు వైద్య పరీక్షలను చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. గర్భిణులకు వైద్య పరీక్షలను నిర్వహించడంతోపాటు అపెక్స్ ఆసుపత్రిలో నార్మల్ డెలివరీ ప్రత్యేక శ్రద్ధ ఉంటుందన్నారు. బిపి షుగర్, దీర్ఘకాలికంగా ఉన్న రోగులకు పరీక్షలను చేసి మందులను పంపిణీ చేశారు. చిన్నపిల్లలకు వచ్చే వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 100మంది రోగులకు ఉచిత పరీక్షలను నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మైనోద్దీన్ సిద్ధికి, మండల గ్రామీణ వైద్యుల అధ్యక్షులు చాతదుర్గ ప్రసాద్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు షఫీవుల్లాఖాన్ లు పాల్గొన్నారు.




## పివిటిజీలకు పక్కా ఇండ్లు నిర్మించి ఇవ్వాలి

### - కులం సంఘం నాయకులు

**వాంకిడి నవంబర్ 13సూర్య మేజర్ న్యూస్ :** మండల పరిధిలో నివాసం ఉంటున్న కొలం (పివిటిజీ) గిరిజన తెగకు చెందిన ప్రతి కుటుంబానికి పక్కా ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ఆదిమ గిరిజన కొలం సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఎంపిడివో పాటిల్ జ్యోత్స్నకు వారు వినతిపత్రం అందజేశారు. సంఘం నాయకులు పేర్కొన్నట్లు, పీఎం జన్మన్ పథకంలో భాగంగా పివిటిజీలుగా గుర్తించబడిన తమకు పక్కా ఇండ్లు మంజూరు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆదేశాలు ఉన్నప్పటికీ ఇప్పటివరకు కొందరికి మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని తెలిపారు. మండలంలో సుమారు 23 కొలం గ్రామాలు ఉన్నప్పటికీ చాలామంది ఇప్పటికీ గుడిసెల్లోనే జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే మండలంలోని ప్రతీ కొలం కుటుంబానికి పక్కా ఇల్లు మంజూరు చేయాలని ఎంపిడివోకు కోరినట్లు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో రాష్ట్ర నాయకుడు సిడం అన్నిగా, జిల్లా అధ్యక్షుడు జల్పత్రావ్, నాయకులు కుంరం లింగు, ఆత్రం ప్రకాష్, సిడం టైంరావు, ఆత్రం తుకారాం తదితరులు ఉన్నారు.

## నీటి సంరక్షణపై అవగాహన ర్యాలీ

**సిరికొండ, నవంబర్ 13, సూర్య మేజర్ న్యూస్**

నీరు మన జీవనానికి మూలాధారం కాబట్టి, భవిష్యత్ తరాలకు అది అందుబాటులో ఉండాలన్న సందేశంతో మండల లోని వాయిపేట్ గ్రామపంచాయతీ పరిధిలో సూర్యాపేట్ గ్రామంలో గురువారం ప్రత్యేక నీటి సంరక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎ పిఓ భీంరావ్,సుభాస్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు కలసి వర్షపు నీటిని సేకరించడం, ప్రతి ఇంట్లో, ప్రతి బోరింగ్ వద్ద ఇంకుడుగుంత ఏర్పాటు చేయడం వంటి పద్ధతులను ప్రోత్సహించారు. “మన బడి - మన నీరు” అనే నినాదంతో ర్యాలీ నిర్వహించగా, విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు నెమ్మదిగా పల్లెటూరి వీధుల్లో నడుస్తూ, నీటి విలువ, వృథా చేయకూడదని సందేశాన్ని గ్రామవాసులకు అందించారు. నీటిని విలువైన సంపదగా భావించి, వృథా చేయకుండా సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, గ్రామ పటేల్ గేడం చంపత్ రావ్, గేడం సార్జు, ఉర్వేత మాణిక్ రావ్, యువకులు మడవి మహేష్, గేడం రాజేష్, గేడం సంజు, దీపక్, నగేష్ పాల్గొన్నారు.






# టాస్క్ ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల నవంబర్ 13,సూర్య మేజర్ న్యూస్**



తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో టాస్క్ ద్వారా 4వ బ్యాచ్‌లో శిక్షణ పొందిన వారికి టాస్క్ మేనేజర్ సాయికుమార్‌తో కలిసి ధృవపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు టాస్క్ ద్వారా వివిధ కోర్సులలో శిక్షణ అందించి ఉపాధి కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. టాస్క్ 4వ బ్యాచ్ లో శిక్షణ పొందిన 35 మందిలో 30 మంది ఆర్యవర్తన్ కంపెనీలో ఈ – పబ్ ప్రోగ్రామర్లుగా ఎంపికయ్యారని తెలిపారు.. సాఫ్ట్ స్కిల్స్ అభివృద్ధి చేసుకోవడం ద్వారా ఆత్మవిశ్వాసంతో మాట్లాడవచ్చని, కష్టపడే తత్వం ఉండాలని తెలిపారు. ఉపాధిలో నూతన అంశాలను నేర్చుకుంటూ వాటిని అమలు చేస్తూ అభివృద్ధి చెందాలని, చిత్తశుద్ధితో పనిచేసే వారికి అవకాశాలు ఎప్పుడూ అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారులు, శిక్షకులు సుధీర్, పూజ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## నాణ్యతకు డిమాండ్ ఎక్కువ
## - జనరల్ మేనేజర్ విజయ భాస్కర్ రెడ్డి.


**రెబ్బెన, నవంబర్ 13, సూర్య మేజర్ న్యూస్:**

పోటీ ప్రపంచంలో నాణ్యమైన వస్తువుకు సదా మార్కెట్లో డిమాండ్ ఉంటుందని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం. విజయ భాస్కర్ రెడ్డి అన్నారు. గురువారం గోలేటి జనరల్ మేనేజర్ కార్యాలయం ఆవరణలో నాణ్యత వారోత్సవాలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. నాణ్యత పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి చేసే పనిలో నాణ్యత ఉండాలన్నారు. వ్యక్తి ప్రవర్తనలో నాణ్యత సమాజంలో ఆదర్శంగా నిలిపితే వస్తు నాణ్యత మార్కెట్లో ప్రథమ శ్రేణి లో ఉంచుతుందన్నారు. రికార్డులు రూపొందించేటప్పుడు శ్రద్ధ కనబరిస్తే అవి సకాలంలో గమ్యాన్ని చేరి, త్వరగా పనులు పూర్తయ్యేల చేస్తాయని అన్నారు. అనంతరం అధికారులు, ఉద్యోగులతో కలిసి నాణ్యత ప్రతిజ్ఞ చేసారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకుడు బయ్యు మొగిలి, అధికారుల సంఘం నాయకుడు ఉజ్వల్ కుమార్ బెహరా, ఏరియా ఇంజినీర్ కృష్ణ మూర్తి, ఎస్ఓ టు జిఎం కె. రాజమల్లు, క్వాలిటీ హెచ్ఓడి రాజేష్ బాబు, పర్సనల్ హెచ్ఓడి శ్రీనివాస్, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్ వివిధ విభాగాధిపతులు తదితరులు పాల్గొన్నారు.




## పులి సంచారం.. గ్రామంలో భయం..!
## - ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
## - రేంజ్ అధికారి నాగవత్ స్వామి

**సిరికొండ, నవంబర్ 12 సూర్య మేజర్ న్యూస్**



"రాత్రి వేళ బయట అడుగు వేయడానికే భయంగా ఉంది" అంటూ సాత్‌మెరి గ్రామస్తులు




వణికిపోతున్నారు. పొలంలో ఉన్న మండపానికి కట్టిన ఆవుపై పులి దాడి చేయడంతో కలకలం రేగింది. ఆవు అక్కడికక్కడే మృతి చెందడంతో గ్రామంలో భయాందోళన నెలకొంది. ఘటన విషయం తెలుసుకున్న వెంటనే అటవీశాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మొదట ఇది చిరుత దాడి అనుకున్నా, రేంజ్ అధికారి నాగవత్ స్వామి నేతృత్వంలోని బృందం పరిశీలనలో అది పెద్ద పులి (టైగర్) దాడి అని నిర్ధారించారు. గ్రామ పరిసరాల్లో పులి అడుగుజాడలు కనబడడంతో రాత్రివేళల్లో ఎవరూ బయటకు రావడం లేదు. పిల్లలు కూడా భయంతో ఇళ్లలోనే ఉన్నారు. పశువులను రైతులు ఇంటి ముందు కడుతున్నారు. అటవీశాఖ అధికారులు రెండు రోజులపాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పులి కదలికలను గమనించేందుకు ప్రత్యేక బృందాలు కెమెరాలు ఏర్పాటు చేశాయి. గ్రామంలో భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఓ చంద్రారెడ్డి, బీట్ ఆఫీసర్లు సంతోష్, భీంజి, నాయక్, బేస్ క్యాంప్ సిబ్బంది జుగాందిరావ్, మారుతి, జంగు తదితరులు పాల్గొన్నారు.

## నష్టపరిహారం వెంటనే చెల్లించాలి
## - తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం మండల కన్వీనర్ మడావి మానిక్ రావ్

**సిరికొండ నవంబర్ 13, సూర్య మేజర్ న్యూస్ :** పెద్ద పులి దాడిలో ఆవును నష్టపోయిన బొజ్జుకు అటవీ శాఖ అధికారులు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం మండల కన్వీనర్ మడావి మానిక్ రావ్ అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిరికొండ మండలం లచ్చింపూరి గ్రామానికి చెందిన మేస్రం బొజ్జు ఆవును సాత్మోరీ గ్రామ పొలిమేరల్లో పెద్ద పులి దాడిచేసి హత మార్చడంతో వాటితోనే వ్యవసాయం చేసే ఆదివాసుల బ్రతుకులు ప్రశ్నార్థకంగా మారాయని, పులుల దాడుల కారణంగా ఎన్నో ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నారని, పులుల దాడి పునరావృతం కాకుండా, అడవుల నుండి దానిని నియంత్రించే చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు ఇప్పటి వరకు సమస్యను పరిష్కరించడంలో ఆలస్యం చేస్తున్నారని ఆయన విమర్శించారు.



## తులం బంగారం ఇచ్చి మాట్లాడాలి
## ...లేదా కేసీఆర్ పేరే తీస్తాం- కన్వీనర్ వెంకటేష్

**తలమడుగు నవంబర్ 13 సూర్య మేజర్ న్యూస్:**


ప్రోటోకాల్ గురించి తెలియని వ్యక్తులు కూడా ప్రెస్ మీట్ పెట్టడం హాస్యాస్పదమని బిఆర్ఎస్ మండల కన్వీనర్ తోట వెంకటేష్ అన్నారు. తలమడుగు మండలంలోని సుంకిడి గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కన్వీనర్ వెంకటేష్ మాట్లాడుతూ బుధవారం బోథ్ లో జరిగిన విషయాన్ని పట్టుకొని ఈరోజు తలమడుగు మండలంలో అక్కడ ఏం జరిగిందో తెలియకుండా ప్రెస్ మీట్ లు పెట్టి మా ఎమ్మెల్యేని మా పార్టీని అవహేళన చేస్తూ రౌడీయిజం గూండాయిజం చేస్తే మేము కూడా చేస్తామని దురుసు పదజాలం వాడి మా పార్టీని



కించపరిచిన మండల నాయకులకు ప్రోటోకాల్ గురించి తెలియదని ఎద్దేవా పలికారు. కళ్యాణ్ లక్ష్మి చెక్కులలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆత్మ డైరెక్టర్ కి ప్రోటోకాల్ ఉందా అని ప్రశ్నించారు. ప్రోటోకాల్ గురించి తెలిసి మాట్లాడాలి కానీ తెలుసుకోకుండా ఏది పడితే అది మా ఎమ్మెల్యేకి నియోజకవర్గంలో మంచి పేరు ఉందని దాన్ని నాశనం చేయగలను కాంగ్రెస్ పార్టీ ఇలాంటి నీచపు రాజకీయం చేస్తుందని అన్నారు. ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి పేరు తీస్తా లేడాని అనడం భావ్యం కాదని ప్రతిసారి కేసీఆర్ పేరే తీస్తాడని అంటున్నారు ఆయన ఇచ్చిన కల్యాణ లక్ష్మి కాబట్టి తీస్తారు మీ సీఎం పేరు మీరు తులం బంగారం పెట్టి ఈ మాట అనాలని కాంగ్రెస్ నాయకులకు సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు సుదర్శన్ రెడ్డి, అభిరామ్ రెడ్డి, గంగాధర్, పల్లవి, రాంబాయి, శ్రీనివాస్, ఆశన్న యాదవ్, మల్లేష్, జనార్ధన్, నవీన్ రెడ్డి, లక్ష్మణ్ కార్యకర్తలు ఉన్నారు.

## కార్మికుల బకాయిలు చెల్లించేవరకు ఆర్వీఎం కంపెనీకి చెల్లింపులు ఆపాలి - ఏఐటీయుసి నాయకులు సీతారామయ్య.

**బెల్లంపల్లి, నవంబర్ 13, సూర్య మేజర్ న్యూస్:** మణచిర్యాల జిల్లా మందమర్రి జీఎమ్ పరిధిలోని కెకెఓసి ప్రాంతంలో ఆర్వీఆర్ కంపెనీ కాంట్రాక్టు కార్మికుల వేతనాలు బకాయిలుగా ఉండగా, కంపెనీ తరపున కార్మికులకు చెల్లించాల్సిన మొత్తం ఒకొక్కరికి రూ.5,500 చొప్పున బకాయిలు ఇప్పటివరకు చెల్లించలేదని ఎఐటీయుసీ నేతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎఐటీయుసీ ఆధ్వర్యంలో కార్మికులు సమావేశమై సింగరేణి యాజమాన్యానికి వినతిపత్రం సమర్పించారు. కార్మికులకు న్యాయం చేయకుండా ఆర్వీఎం కంపెనీకి సింగరేణి తరఫున బాకాయిలను విడుదల చేస్తే పెద్దఎత్తున ధర్నాలు, ఆందోళనలు చేపడతామని నేత సీతారామయ్య హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎండి నసిరద్దీన్, ప్రణయ్, పి. శ్రీధర్, కే. రమేష్, రాజకుమార్, ఎం. ఉమేష్, ఏ సతీష్, రాజయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



## మా పార్టీ నాయకులపై దాడి చేస్తే ఊరుకోం...
## - మాజీ జడ్పిటిసి గణేష్ రెడ్డి

**తలమడుగు నవంబర్ 13 సూర్య మేజర్ న్యూస్:**

ప్రోటోకాల్ అడిగారు అని బిఆర్ఎస్ పార్టీ నాయకులు మా పార్టీ నాయకులపై దాడి చేస్తుంటే ఊరుకోమని మాజీ జడ్పిటిసి గోక గణేష్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం బోథ్‌లో జరిగినటువంటి దాడిని కండిస్తూ తలమడుగు మండలంలోని సుంకిడి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్ణయించారు.ఇందులో భాగంగా మాజీ జడ్పిటిసి



గణేష్ రెడ్డి మాట్లాడుతూ మా కాంగ్రెస్ పార్టీ నాయకులపై దాడి చేయడం సరియైన పద్ధతి కాదని ఇలా చేస్తూ పోతే మా పార్టీ మేము ఊరుకోమని కచ్చితంగా దీనికి జవాబు మీ పద్ధతిలోనే ఇస్తామని అన్నారు. మంత్రుల కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రోటోకాల్ గురించి మాట్లాడి మా నాయకులను రాకుండా చేస్తాడు మరి ఆయన సమక్షంలో నిన్న కళ్యాణ లక్ష్మీ షాది ముభారక్ చెక్కులను ప్రోటోకాల్ పాటించకుండా అక్కడే బోథ్ ఎమ్మెల్యే అధికారు లు ఉండి కూడా పట్టించుకోకపోవడం గమనార్హం అది పక్కన పెడితే ప్రోటోకాల్ పాటించకుండా వ్యవహరిస్తున్నారు అని ప్రశ్నించిన మా కాంగ్రెస్ పార్టీ నాయకులపై ఇష్టారాజ్యంగా దాడి చేస్తుంటే చూస్తూ ఉన్నారని ఇది సరైన పద్ధతి కాదని మండిపడ్డారు. ప్రతిసారి కెసిఆర్ పేరు తీయడం సరైన పద్ధతి కాదని రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తున్నది మా పార్టీ దీన్ని గుర్తించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేశ్వర్,వెంకన్న యాదవ్,ప్రకాష్ రావు,ప్రవీణ్ రెడ్డి, సాంబశివ్,శ్రీనివాస్ రెడ్డి,దేవన్న, ప్రేమ్ రెడ్డి, విలాస్ కార్యకర్తలు ఉన్నారు.

## నూతన తహసిల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి భూమి పూజ

**ఖానాపూర్ సూర్య మేజర్ న్యూస్:**

ఖానాపూర్ మండల కేంద్రంలో నూతన తహసిల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జ పటేల్ తో కలిసి భూమి పూజ చేశారు.అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యేలు కార్యాలయ నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలించి, అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. కార్యాలయ నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించి, నిర్ణిత గడువులోగా పనులు పూర్తి చేసి, ప్రజలకు సేవలు అందించడానికి కార్యాలయాన్ని అందుబాటులోకి తేవాలని అన్నారు. నూతన కార్యాలయ భవన నిర్మాణం పూర్తయ్యేలోపు అధికారులు విధులు నిర్వహించడానికి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, తహసిల్దార్ సుజాత, మండల ప్రత్యేక అధికారి జీవరత్నం, ఈఈ పిఆర్ చందు జాదవ్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీనాయకులు చేస్తున్న భూ కబ్జాల పై ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలి

### - లేకుంటే హైదరాబాద్ లో ఎమ్మెల్యే వినోద్ ఇంటిని ముట్టడిస్థాం

**బెల్లంపల్లి, నవంబర్ 13, సూర్య మేజర్ న్యూస్:**

కాంగ్రెస్ పార్టీ నాయకులు బెల్లంపల్లిలో చేస్తున్న భూకబ్జాలు, రూ,,3 లక్షలకు ఇందిరమ్మ ఇళ్ళు అమ్మకాలు చేస్తున్నారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గురువారం రోజున బెల్లంపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధికార ప్రతినిధి నూనేటి సత్యనారాయణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్ లు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మున్సిపాలిటీలోని వివిధ వార్డులలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాలు ప్రజలకు ఇవ్వకుండా వారి వద్ద పెట్టుకొని 50 వేల రూపాయల లంచాలు ఇస్తేనే ప్రొసీడింగ్ లు లబ్ధిదారులకు ఇస్తున్నారని వారు ఆరోపించారు. రూ,,3 లక్షలు ఇచ్చినవారికే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తామని కాంగ్రెస్ నాయకులు



ఆడియో టేపుల్లో పేర్కొనడం సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్యే బెల్లంపల్లిలో లేకుండా హైదరాబాదులో ఉంటూ వీటిని ప్రోత్సహిస్తున్నారని వారు విమర్శించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే వారిపై చర్యలు తీసుకోకుంటే హైదరాబాదులోని ఎమ్మెల్యే వినోద్ ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో బెల్లంపల్లి మున్సిపాలిటీలో అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్ లు స్పందించి తక్షణ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ లు కాంగ్రెస్ నాయకులు వారి ఇండ్లలో పెట్టుకుని లబ్దిదారులకు అన్యాయం చేస్తున్నారాని విమర్శించారు. బెల్లంపల్లిలో రోడ్డు వెడల్పు కార్యక్రమంలో ముందు చూపుతో అధికారులు వ్యవహరించకపోవడంతో రోడ్డువెడల్పు పేరుతో చేసిన కూల్చివేతలతో అనేక మంది ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారని వారు పేర్కొన్నారు. వారికి తక్షణ పునరావాస చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యేను వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ రాములు, బీఆర్ఎస్ యూత్ టౌన్ ప్రెసిడెంట్ సబ్బని అరున్, నియోజక వర్గం యూత్ ప్రధాన టౌన్ ప్రెసిడెంట్, మైనార్టీసెల్ టౌన్ అధ్యక్షుడు అలీ, నాయకులు ఖలీల్, ఖదీర్, ధర్మేందర్, మద్దెల గోపి, సాయి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయ ఏవో హన్మంతరావు కు వినతి పత్రం అందజేశారు.

## ప్రతి నీటి చుక్కను కాపాడుదాం

## స్పెషల్ అధికారి డీఎల్‌పీఓ ఫణిధర్

### మనబడి మన నీరు కార్యక్రమం పై ర్యాలీ

**సిరికొండ నవంబర్ 13 సూర్య మేజర్ న్యూస్**

ప్రతి నీటి చుక్కను కాపాడటం మానవ జీవనానికి కీలకమని మండల స్పెషల్ అధికారి డీఎల్‌పీఓ ఫణిధర్ అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించిన మన బడి - మన నీరు కార్యక్రమంలో భాగంగా గురువారం



మండల కేంద్రంలో గాంధీ చౌక్ నుంచి ప్రాథమిక పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి ప్రతి చుక్కను కాపాడితే మనుగడకు మేలు జరుగుతుందని, తగిన జాగ్రత్తలు తీసుకుంటే ప్రకృతిని రక్షించవచ్చని, తగిన జాగ్రత్తలు తీసుకుంటే ప్రకృతిని రక్షించగలమని, నీటిని ఆదరించటం వల్ల మానవ మనుగడకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ తుకారం, ఎంపీడీఓ ముహమ్మద్ రయీస్ ఉల్లా, ఎంఈఓ సునీల్, ఉపాధ్యాయులు పెంటన్న, బాలాజీ, నవీణ్, రంజాన్, ప్రకాష్, దత్తు, గురుమూర్తి, ఈశ్వర్, టీ ఈ సారుప, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించండి ఎమ్మెల్యే కు మైసంపేట రాంపూర్ పునరావాస కేంద్ర గ్రామస్తుల వినతి

ఖానాపూర్ టౌన్ నవంబర్ 13 సూర్య మేజర్ న్యూస్

నిర్మల్ జిల్లా కడెం మండలంలోని మైసంపేట రాంపూర్ పునరావాస కేంద్ర గ్రామస్తులు తమకు సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే వేడ్మా బొజ్జు పటేల్ కు వారి గోడు వెళ్లబోసుకున్నారు. మొత్తం 148 కుటుంబాలలో కేవలం 96 మందికే ఇండ్లు, వ్యవసాయ భూములు ఇచ్చినారని, మిగతా 50 మందికి కూడా ఇవ్వాలని అన్నారు. ఇచ్చిన ఇండ్లు కూడా నాసిరకంగా ఉన్నాయని తెలియజేసినారు. వ్యవసాయ భూములకు త్వరగా ల్యాండ్ లెవలింగ్ చేయించాలని, నీటి సౌకర్యం కల్పించాలని కోరినారు. దాదాపు 100 మంది ప్రజలు ఖానాపూర్ కు తరలివచ్చి ఎమ్మెల్యేకు తమ గోడు విన్నవించుకున్నారు.

## ప్రతి పల్లెలలో ఇంకుడు గుంతలు నిర్మించాలి

### - ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**నేరడిగొండ, నవంబర్ 13, సూర్య మేజర్ న్యూస్**

మండలంలోని స్థానిక ప్రభుత్వ పరిషత్ సెకండరీ పాఠశాలలో నిర్వహించిన మనబడి మన జలం కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఇంకుడు గుప్తుల ఇంకుడు గుంతల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ పాఠశాలలో ప్రతి పల్లెలో ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని అన్నారు. ఈ ఇంకుడు గుంతలు నిర్మించడం వలన నీటిని నిల్వ చేసిన వారం అవుతామని భవిష్యత్తులో ఇంకుడు గుంతల వలన భూమిలో నీరు నిల్వ ఉంటుందని అలాగే మంచి ప్రయోజనాలు ఉంటాయని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. నీ మహోన్నత కార్యక్రమం నాడు కెసిఆర్ నాయకత్వంలో మొదలు పెట్టారని అన్నారు. కెసిఆర్ ముఖ్యమంత్రి ఉన్నప్పుడు మన ప్రాంతంలో అనేక చోట్ల చెక్ డ్యాములు ప్రతీ ఇంటికి



ఇంకుడు గుంతల నిర్మాణాల మొదలు పెట్టారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల నాయకులు అధికారులు తదితరులు ఉన్నారు.

## బాల్య వివాహాల నిర్మూలన పై అవగాహన సదస్సు

**ఖానాపూర్ టౌన్ నవంబర్ 13 సూర్య మేజర్ న్యూస్**

నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని బీర్నంది జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాలలో బాల్యవివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. అమ్మాయిలకు 18 సంవత్సరాలు అబ్బాయిలకు 21 సంవత్సరాలు




పూర్తికాకముందు వివాహం చేయకూడదని, ఎక్కడైనా గ్రామంలో బాల్య వివాహం చేస్తున్నారని తెలిస్తే వెంటనే 1098 కి సమాచార అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, బాలల హక్కుల రక్షణలో ప్రతి ఒక్కరు ముందుండాలని అన్నారు. అలాగే సఖి సేవలను, చైల్డ్ లైన్ సేవలను గురించి కూడా వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీ వరప్రసాద్, చైర్మన్ నీలా, మిషన్ శక్తి జెండర్ స్పెషలిస్ట్ మౌనిక, సఖి కౌన్సిలర్ కవిత, సఖి కేసు వర్క లావణ్య, చైల్డ్ లైన్ కౌన్సిలర్ సుప్రియ, ఆశ వర్కర్, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

## గాలికి రూపం లేదు - కంటికి కనబడదు కానీ ప్రాణదాత

### సీఐ రమణమూర్తి

**జన్నారం, నవంబర్ 13, సూర్య మేజర్ న్యూస్ :**

మనం చేసే మంచిపనిలో దేవుడు అదృశ్యంగా, మౌనంగా ఉంటూనే మనకు సాయం చేస్తాడు... మన ప్రయత్నం లోపం లేకుండా చూసుకోవలసినది మాత్రం మనమే... కనపడని గాలి నిత్యం మనకి ప్రాణం పోస్తూనే ఉంటుంది... గాలికి రూపం లేదు... కంటికి కనబడదు.. కానీ మనిషికి



ప్రాణదాత గాలి అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందని లక్షెట్టిపేట సీఐ రమణమూర్తి అన్నారు. గురువారం సూర్య మేజర్ న్యూస్ తో రమణ మూర్తి మాట్లాడుతూ తొక్కేయడానికి వంద మంది ఉన్న రక్షించడానికి ఒక్కరు ఉంటారు.. అదే నువ్వు నమ్మిన ధర్మమని అన్నారు. సంపదలెన్ని ఉన్న తృప్తి లేని జీవితం వ్యర్థమని, పూరి గుడిసె బ్రతుకైన కంటినిండా నిద్రపోయే మనిషి జీవితం ధన్యమని అన్నారు. అలాగే మనలోని భయమే శత్రువుకి సగం బలమనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. చిరునవ్వు ప్రతికూల పరిస్థితులను సైతం అవకాశాలుగా మార్చగలదని, అందుకే ఎల్లప్పుడూ నవ్వుతూ ఉంటే చాలు అదే సర్వరోగ నివారిణి అని అన్నారు. ప్రపంచంలో అందర్నీ సమానంగా చూసేది గడియారం మాత్రమే కానీ పేదవాడికి ధనవంతులకు ఒకేలా ఉంటుందని ఇది మాత్రం ఎవరికీ తలవంచదని రమణమూర్తి అన్నారు.

## రాష్ట్రస్థాయి ఫుట్బాల్ పోటీలకు ఎంపికైన బెల్లంపల్లి సిఓఈ విద్యార్థి

**బెల్లంపల్లి, నవంబర్ 13, సూర్య మేజర్ న్యూస్:**

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల సెంట్రల్ ఆఫ్ ఎక్సెన్సీ బెల్లంపల్లి నుండి ఎమ్. కార్తీక్ పదవ తరగతి చదువుతున్న విద్యార్థి రాష్ట్రస్థాయి ఎంపిక అవ్వడం పట్ల ప్రిన్సిపాల్ అకిడి విజయ్ సాగర్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. మంచిర్యాల జిల్లా హెచ్ జి ఎఫ్ సెక్రెటరీ యాకూబ్ మాట్లాడుతూ క్రీడలతో మంచి భవిష్యత్తు ఉంటుందని సూచించారు. రాష్ట్రస్థాయి ఫుట్బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థికి వ్యాయామ ఉపాధ్యాయులు అల్లూరి వామన్, ముచ్చ కుర్తి రాజశేఖర్ అభినందనలు తెలిపారు.



## మహిళల రక్షణ మా బాధ్యత

### -షి టీమ్ యస్.ఐ.ఉషారాణి

**మంచిర్యాల టౌన్, నవంబర్ 13,సూర్య మేజర్ న్యూస్**

మహిళలు,విద్యార్థినుల భద్రత,రక్షణ కు అత్యంత ప్రాధాన్యతనిస్తూ మంచిర్యాల జిల్లా షి టీమ్ ఇన్చార్జి యస్.ఐ.లు ఉషారాణి, హైమ ఆధ్వర్యంలో కార్మెల్ కాన్వెంట్ హైస్కూల్ లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.విద్యార్థులకు ఈవ్ టీజింగ్, సైబర్ నేరాలు,మానవ అక్రమ రవాణా, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, ట్రాఫిక్ నియమాలు,టీ సేఫ్- యాప్, షీ టీమ్



లపై సమగ్ర అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం లో షి టీమ్ ఎస్ ఐ ఉష విద్యార్థిని,విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మహిళా లు సోషల్ మీడియాలో గుర్తు తెలియని వ్యక్తులతో స్నేహం చేయడం, వ్యక్తిగత వివరాలు, ఫోటోలు పంచుకోవడం వంటి వాటితో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.విద్యార్థినులు ఆకతాయిల వేధింపులకు గురైనప్పుడు,ఈవ్ టీజింగ్ లకు భయపడకుండా వెంటనే డైల్ 100కు లేదా షీ టీమ్ నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.విద్యార్థినులు,మహిళల భద్రత కోసం టీ-సేఫ్ యాప్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకుని, అత్యవసర పరిస్థితుల్లో దానిని ఉపయోగించే విధానం గురించి వివరించారు. షీ టీమ్ సేవలు, వాటి ఉద్దేశాన్ని గురించి వివరిస్తూ, ఎప్పుడూ అందుబాటులో ఉండే రామగుండం షీ టీమ్ నంబర్ వాట్సప్ 6303923700, మంచిర్యాల షి టీమ్ నంబర్ 8712659385 నంబర్లను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు. మహిళా విద్యార్థుల రక్షణకు పోలీస్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని మీ రక్షణ మా బాధ్యత అని తెలిపారు.

## సిపిఐ శతజయంతి ఉత్సవాలకు నాంది-జోడేఘాట్ నుంచి భద్రాచలం వరకూ బస్సు జాత

### డిసెంబర్ 26న ఖమ్మంలో భారీ ముగింపు సభ

**రామకృష్ణాపూర్, నవంబర్ 13, సూర్య మేజర్ న్యూస్**

శతాబ్ద కాలం పూర్తి చేసుకుంటున్న భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతజయంతి ఉత్సవాల సందర్భంగా, ఈనెల 15వ తేదీ నుండి కొమరం భీం జిల్లా జోడేఘాట్ నుంచి భద్రాచలం వరకు బస్సు జాత ప్రారంభం కానుంది. డిసెంబర్ 26న ఖమ్మంలో జరగనున్న శతజయంతి ఉత్సవాల ముగింపు సభను జయప్రదం చేయడం లక్ష్యంగా ఈ బస్సు జాత నిర్వహించబడుతోంది.ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను రామకృష్ణాపూర్ యూనియన్ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ మాట్లాడుతూ.. సిపిఐ పార్టీ నాటి నుండి నేటి వరకు బడుగు, బలహీన వర్గాలు, కార్మికులు, కర్షకుల కోసం నిరంతరం పోరాటం సాగిస్తూ హక్కులు సాధించిన చరిత్రను కలిగింది. ఆ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ బస్సు జాత లక్ష్యం” అని తెలిపారు. జోడేఘాట్‌లో ప్రారంభమయ్యే బస్సు జాతను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారు.ఈ కార్యక్రమానికి సిపిఐ జాతీయ మాజీ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి నాయకత్వం వహిస్తారు.బస్సు జాతలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కల్లపల్లి శ్రీనివాస్ రావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేల శంకర్, దళిత కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కే. మణికంఠ రెడ్డి, తెలంగాణ ప్రజానాట్యమండలి కళాకారులు పాల్గొంటారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సిపిఐ శతజయంతి ఉత్సవాల ముగింపు భారీ సభలో 40 దేశాల నుండి ప్రతినిధులు, అలాగే అన్ని రాష్ట్రాల పార్టీ, ప్రజా సంఘాల శ్రేణులు పాల్గొననున్నట్లు రామడుగు లక్ష్మణ్ తెలిపారు.ఈ సభను జయప్రదం చేయాలని అన్ని వర్గాల ప్రజలను ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఇప్పకాయల లింగయ్య, జిల్లా సమితి సభ్యులు మిట్టపల్లి, వనం సత్యనారాయణ, మామిడి గోపి, పార్టీ నాయకులు పోతర్ల రాములు, కే. దేవానంద్, పొలవేన చందర్, మద్దెల శంకర్, జీలకర్ర మురళి తదితరులు పాల్గొన్నారు.